● కొత్త రచయితలు మాత్రమే ఇన్లాండ్ కవర్‌మీద కథలు రాసి పంపాలి.

## పుత్రోత్సాహంబు...

"నాన్నా నేను పని చేద్దామనుకుంటున్నాను. ఎక్కడన్నా పనిలో పెట్టండి" నేనేం చెప్తానా అని ఎదురుచూస్తూ అన్నాడు మా అబ్బాయి.

"నువ్వు పని చేయడమేంటి నాన్నా..." ప్రేమని ఆశ్చర్యంలో రంగరించి అడిగాను.

'వేసవి సెలవులు కదా! నాకేం తోచడం లేదు...రిజల్ట్స్ వచ్చేసరికి రెండునెలలు పడుతుంది. అంతవరకూ...'నసిగాడు.

ముందు నేను తేలిగ్గా తీసుకున్నాను. కాని మూడు నాలుగు రోజులు వరుసగా పొద్దున సాయంత్రం అడుగుతూనే వున్నాడు. వాడు సీరియస్‌గా అడుగుతున్నాడని నాకు అర్థమయింది. నేను ప్రయత్నాలు మొదలెట్టాను.

నా కొలీగ్ నారాయణమూర్తి మామగారి ఆటోమొబైల్ షాప్‌లో మెకానిక్‌గా పనికి కుదిరాడు. నెలకు మూడు వందల జీతంతో పని నేర్పే పద్ధతి మీద.

మావాడు చాలా శ్రద్ధగా పని చేస్తున్నాడని నారాయణమూర్తి ఒకటి రెండుసార్లు నాతో చెప్పాడు. మావాడు చదువుకి స్వస్తి చెప్పి...పనిలో స్థిరపడతాడేమో ననిపించింది. ఎలా రాసి పెట్టివుంటే అలా జరుగుతుందనుకున్నాను. రెండు నెలలు గిర్రున తిరిగాయి.

ఒకనాడు వాడు కొన్ని పాకెట్లతో ఇంటికొచ్చాడు. "నాన్నా...ఇదిగో మీకు మంచి చెప్పులజత...కళ్ళజోడు.. అమ్మకి చీర..."

నేను ఆశ్చర్యపోయాను...నాకంతా అయోమయంగా వుంది. "అవున్నాన్నా...నువ్వు డబ్బుకు ఎంత ఇబ్బంది పడుతున్నావో నేను ప్రతిరోజు గమనిస్తున్నాను...అమ్మ అనారోగ్యానికి మందులకి...ఇంటికి మీ డబ్బులు ఏ మూలకీ సరిపోవడం లేదు...కళ్ళజోడు విరిగినా...చెప్పులజత అరిగినా...అలాగే బాధపడుతూ నెట్టుకొచ్చేస్తున్నారు...నా రెండు నెలల వేసవి సెలవులని వృధాగా గడిపేకన్నా...కష్టపడి పనిచేసి ఇవి బహుమతి ఇవ్వాలనిపించింది."

నా కళ్ళలో ఆనందభాష్పాలు...నోట మాట రావటం లేదు...

"నాకు అది కొనివ్వు...ఇది కొనివ్వు...' అని కాలేజీకెళ్ళే పెద్దపెద్ద పిల్లలు కూడా తల్లిదండ్రుల ప్రాణం తీస్తున్న ఈ రోజుల్లో...మా కోసం తన వేసవి సెలవులని...ఆనందాన్ని..త్యాగం చేసి మా కోసం చిన్న చేతులతో సంపాదించి తెచ్చిన వాడి పెద్దమనసుకి...మనసులో జోహార్లర్పించాను.

పి.వెంకటసుబ్బారాయుడు

## మరదలు

శ్రీను విజయవాడలో బస్సు దిగగానే పిటపిటలాడే తన పదహారేళ్ళ మరదలు వాసంతి దగ్గరకు వచ్చి కుడి చేతిలోని సూట్‌కేసు అందుకొని ఆటోలో ఇంటికి తీసుకెళ్ళింది.

కుటుంబరావు వారసత్వం కోసం పోటీపడి వరుసగా పవిత్ర, పల్లవి, వాసంతి, వసుధలను కని ఓడిపోయాడు. మూడు నెలల క్రితం శ్రీనుకు రెండో అమ్మాయి పల్లవిని ఇచ్చి పెళ్ళి చేశాడు. శ్రీను అత్త వారింటికి రాగానే మరదలు వాసంతి ముందే భార్యపల్లవిని అమాంతంగా బెడ్‌రూమ్‌లోనికి ఎత్తుకెళ్ళి చిలిపి పనులు చేయసాగాడు.

రోజూ అత్తమామలు వారివారి పనులకు వెళ్ళిన తర్వాత భార్య వంటగదిలో వంట చేసుకొంటుండగా శ్రీను మరదలు వాసంతి గదిలోకెళ్ళి ఏదో వంకతో ఆమె శరీరాన్ని తాకుతుండేవాడు. వయసులో వున్న వాసంతికి మగచేయి తగులుతుంటే తమకంతో ఊగిపోయి కాదనలేకపోయేది. ఒకరోజు వాసంతి బెడ్‌పై పడుకొని వుండగా శ్రీను ఆమెను ముద్దుపెట్టుకొని గట్టిగా కౌగిలించుకొన్నాడు. వాసంతి బావ కౌగిలిని విడిపించుకొని వెళ్ళిపోయింది.

ఈ విషయం ఇంట్లో చెప్తుందేమోనని దిగులుతో సాయంత్రం వరకు బెడ్‌రూమ్‌లోనే తలపట్టుకొని టెన్షన్‌తో కూర్చుండిపోయాడు శీను.

"వాసంతీ! ఇదిగో ఈ కాఫీ పట్టుకెళ్ళి మీ బావకివ్వవే"

శ్రీను కు భార్య మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి. మరదలు కాఫీ 'తెస్తుందా? లేదా? తీసుకొస్తే నామీద కోపం లేనట్లే కాబట్టి ఒక ముద్దు అడిగేయాలి అనుకొన్నాడు. వాసంతి కాఫీ కప్పు తెచ్చి అందించింది.

శీను తాగలేదు.

"కాఫీ తాగు బావా?"

"ముద్దు" బుగ్గ చూపించి అడిగాడు. వాసంతీ బావకు ముద్దిచ్చింది.

"వాసంతీ! వెన్నెల రాత్రులు పైగా చల్లని గాలి అందరూ నిద్రపోయాక అంటే పన్నెండు గంటలకు డాబా పైకి రావాలి వచ్చేంతవరకు ఎదురు చూస్తా!" వాసంతీ బావకు జవాబు చెప్పక వెళ్ళిపోయింది. రాత్రి పన్నెండయింది. భార్యతో సహా అందరూ నిద్రపోయారని నిర్ణయించుకొని కుడివైపు మెట్లనుంచి డాబా పైకెళ్ళాడు. వాసంతీ తెల్లటి చుడీదార్‌తో అటువైపు తిరిగి కూర్చునివుంది. శ్రీను ఆమెను వెనుకనుంచే గట్టిగా కౌగిలించుకొని "వాసూ! నాకు తెలుసు వస్తావని" అని ఆమెను తనవైపుకు తిప్పుకొని చూసి ఆశ్చర్యపోయాడు. కారణం మరదలు వాసంతీ కాదు భార్య పల్లవి తలదించుకొన్నాడు. ఎదురుగా చప్పట్లు వినబడుతున్నాయి. తలపైకెత్తి చూశాడు. వాసంతీ ఎడమవైపు మెట్లనుంచి పైకి వస్తూ 'ప్రతిమగాడికి, మొగుడికి తన భార్య పరువాలను కన్నెగా తనే దోచుకోవాలని వుంటుంది. అలాంటిది నా కన్నెత్వాన్ని పాడుచేయడం నీకు న్యాయమా బావా! నీ భార్యని నీలాగే పెద్దక్క మొగుడు కోరుకొంటే అప్పుడు పెద్దక్క, చిన్నక్క కలిసి ఆడిన నాటకమే ఇవుడు చిన్నక్క నేను ఆడాము. బావా! ఇబ్బంది పెట్టివుంటే మన్నించు నీ ప్రేమ ఒక్క అక్కకే సొంతం కావాలి. అసలే వెన్నెల రాత్రులు పైగా చల్లని పిల్లగాలి మీ ఇద్దరి మధ్య నేనెందుకు వస్తా! అంటూ బావ శ్రీను కు సున్నితంగా బుద్ధిచెప్పి మెట్లు దిగింది వాసంతి.

— పేరూరు బాలసుబ్రమణ్యాం